# గుజరాత్‌లో టీచర్ల మిస్సింగ్!

- ఉద్యోగం రాష్ట్రంలో.. ఉండేది విదేశాల్లో
- మరికొంత మంది అనధికార సెలవుల్లో
- అయినా జీతం మాత్రం ప్రతి నెలా జమ
- ఈ తరహాలో 150 మంది ఉపాధ్యాయులు



అహ్మదాబాద్, ఆగస్టు 13: గుజరాత్‌లో దాదాపు 150 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు మిస్సింగ్ అయ్యారు! టీచర్లు ఏంటి.. అదృశ్యం కావడమేంటి అని అనుకొంటున్నారా? అవును రాష్ట్రంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా ఉన్న వాళ్లు గత కొన్నాళ్లుగా కనిపించడం లేదు. దాదాపు 50 మంది రాష్ట్రంలో ఓవైపు టీచర్ పోస్టులో ఉండగానే.. వారంతా విదేశాల్లో సెటిల్ అయినట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. మిగతా దాదాపు 100 మంది ఉపాధ్యాయులు కూడా పాఠశాలలకు హాజరు కాకుండా ఎలాంటి అనుమతి లేకుండా సంవత్సరాలుగా, నెలలుగా అనధికార సెలవుపై ఉన్నట్టు తెలుస్తున్నది. ఇక్కడ కొసమెరుపు ఏంటంటే, విదేశాల్లో సెటిల్ అయినప్పటికీ లేదా అనధికార సెలవుపై ఉన్నప్పటికీ, వారి ఖాతాల్లో ప్రతి నెలా జీతం పడుతున్నట్టు పలు మీడియా నివేదికలు చెబుతున్నాయి.

### ఇది ఓ వ్యవస్థీకృత స్కామ్

గత వారం బనస్కాంత జిల్లాకు చెందిన ఓ టీచర్ గత కొన్నేండ్లుగా అమెరికాలో నివాసం ఉంటున్నట్టు, ఆయన ఈ ఏడాది జనవరి వరకు జీతం తీసుకొన్నాడని తేలింది. పలు ఇతర జిల్లాల్లోనూ ఈ విధమైన ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఉపాధ్యాయుల మిస్సింగ్ వ్యవహారంపై ప్రతిపక్ష కాంగ్రెస్ స్పందించింది. ఇది వ్యవస్థీకృత స్కామ్ అని విమర్శించింది. అలాంటి టీచర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. కంట్రోల్ అండ్ కమాండ్ సెంటర్(సీసీసీ) ద్వారా దాదాపు 50 వేలకు పైగా పాఠశాలల్లో ఉపాధ్యాయుల అటెండెన్స్, టీచర్లు, విద్యార్థుల కార్యకలాపాలపై రియల్ టైమ్ పర్యవేక్షణ చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నదని, అయితే తాజాగా వెలుగులోకి వచ్చిన అంశంపై ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించింది.

### దర్యాప్తు ప్రారంభం

'ఉపాధ్యాయుల మిస్సింగ్' వ్యవహారం వెలుగులోకి రావడంతో రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు ప్రారంభించింది. విద్యా శాఖ మంత్రి ప్రఫుల్ పన్సేరియా సోమవారం మాట్లాడుతూ 32 మంది టీచర్ల విదేశాలకు వెళ్లినట్టు గుర్తించామని, 31 మంది అనధికార సెలవుల్లో ఉన్నారని తెలిపారు. సోమవారం నాటికి 17 జిల్లాల నుంచి ఈ మేరకు సమాచారం సేకరించామని పేర్కొన్నారు. అయితే వారిలో ఒక్కరు కూడా జీతం పొందడం లేదని చెప్పుకొచ్చారు. ఇతర జిల్లాల నుంచి కూడా సమాచారం సేకరిస్తున్నామని, చట్టానికి అనుగుణంగా తగిన చర్యలు తీసుకొంటామని తెలిపారు.

# నిరసనల పేరుతో విధ్వంసం

- నా తండ్రిని, పోరాట వీరులను అవమానించారు
- ప్రజలే న్యాయం చేయాలి : హసీనా



న్యూఢిల్లీ : నిరసనల పేరుతో బంగ్లాదేశ్‌లో విధ్వంసం సృష్టించారని, తన తండ్రి, పోరాట వీరుల త్యాగాల్ని అవమానించారని మాజీ ప్రధాని షేక్ హసీనా అన్నారు. సైనిక తిరుగుబాటు వెనుకున్న రాజకీయ శక్తులపై ఆమె మండిపడ్డారు. దేశ ప్రజలే తనకు న్యాయం చేకూర్చాలని అన్నారు. దేశాన్ని వీడిన తర్వాత షేక్ హసీనా, మంగళవారం తొలిసారి మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'జాతి పిత, బంగబంధు షేక్ ముజీబర్ రెహమాన్, ఆయన నాయకత్వంలో స్వతంత్ర దేశంగా ఆత్మ గౌరవాన్ని, స్వంత గుర్తింపు అందుకున్నాం. దీనినంతటినీ దారుణంగా అవమానించారు' అంటూ తిరుగుబాటు వెనుకున్న శక్తులపై ఆమె మండిపడ్డారు.

### హిందూ-ముస్లింలు ఐక్యంగా ఉండాలి

బంగ్లాదేశ్‌లో హిందువుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతున్న వేళ, తాత్కాలిక ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న మహమ్మద్ యూనస్ మంగళవారం 'ఢాకేశ్వరీ ఆలయాన్ని' సందర్శించారు. దేశంలోని ప్రతి ఒక్క పౌరుడి హక్కుల్ని కాపాడటంపై తన ప్రభుత్వం దృష్టిసారిస్తున్నదని యూనస్ చెప్పారు. హిందువులు, ముస్లింలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.ప్రజలందరికీ ఒకే రాజ్యాంగం, చట్టముందని, మతపరంగా విడిపోరాదని యూనస్ చెప్పారు. 'మన మధ్య ఉన్న వివాదాల్ని పక్కకుపెట్టి, మనమంతా ఒక్కటేనని చూపాలి' అని అన్నారు.

## యాంటీ ట్యాంక్ క్షిపణి పరీక్ష సక్సెస్


న్యూఢిల్లీ, ఆగస్టు 13: పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన 'పోర్టబుల్ యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్' క్షిపణి పరీక్ష విజయవంతమైందని రక్షణ శాఖ వర్గాలు మంగళవారం ప్రకటించాయి. రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్‌లో డీఆర్‌డీవో చేపట్టిన క్షిపణి ట్రయల్స్ విజయవంతమయ్యాయి. క్షిపణి పనితీరు, వార్‌హెడ్ పనితీరు అద్భుతంగా ఉందని అధికారులు తెలిపారు.

## 'కమలా హారిస్ గెలిస్తే దేశం నాశనమే'

వాషింగ్టన్, ఆగస్టు 13: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న కమలా హారిస్‌ను ఒక డమ్మీ అభ్యర్థిగా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అధ్యక్షుడు జో బైడెన్ కంటే ఆమె అసమర్థురాలు అని అన్నారు. ఆమె గెలిస్తే దేశం నాశనమవుతుందని వ్యాఖ్యానించారు. ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్‌కు సోమవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. కమలా హారిస్ ఒక రాడికల్ లెఫ్ట్ ఉన్మాది అంటూ తీవ్రంగా వ్యాఖ్యానించారు. పార్టీలో తిరుగుబాటు కారణంగానే డెమొక్రటిక్ అభ్యర్థిగా బైడెన్ స్థానంలో కమలా హారిస్‌ను మార్చారన్న తన ఆరోపణను ట్రంప్ పునరుద్ఘాటించారు. దేశ సరిహద్దు భద్రత విషయంలో హారిస్ ఘోరంగా విఫలయ్యారని, వేలాది మంది దేశంలోకి అక్రమంగా ప్రవేశిస్తున్నారని అన్నారు. బైడెన్-హారిస్ పాలనలో ఓపెన్ బోర్డర్ పాలసీ కారణంగా దేశంలో నేరాలు గణనీయంగా పెరిగాయని విమర్శించారు.

# శత్రు విధ్వంసక కామికేజ్!

## సూసైడ్ డ్రోన్‌ను ఆవిష్కరించిన ఎన్‌ఏఎల్



న్యూఢిల్లీ, ఆగస్టు 13: దేశీయంగా అభివృద్ధి చేయనున్న అత్యాధునిక 'కామికేజ్' డ్రోన్లను నేషనల్ ఏరోస్పేస్ ల్యాబోరేటరీస్ (ఎన్ఏఎల్) ఆవిష్కరించింది. 'డూ అండ్ డై' అనే పద్ధతిలో అప్పగించిన పనిని ఈ డ్రోన్ సమర్థంగా పూర్తి చేస్తుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ స్వదేశీ మానవ రహిత వాయు వాహనంలో దేశీయంగా అభివృద్ధి చేసిన ఇంజిన్లను వినియోగిస్తున్నట్టు తెలిపింది. కామికేజ్ డ్రోన్లకు ఏకంగా 1,000 దూరం వరకు ప్రయాణించే సామర్థ్యం ఉంటుందని వెల్లడించింది. కామికేజ్ డ్రోన్లు 21వ శతాబ్దంలో యుద్ధ రంగంలో గేమ్ ఛేంజర్‌గా ఉంటుందని ఎన్ఏఎల్ డైరెక్టర్ డాక్టర్ అభయన్ పషిల్కర్ పేర్కొన్నారు. కామికేజ్ డ్రోన్ల ప్రాజెక్టు ప్రారంభానికి కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్(సీఎస్ఐఆర్) ప్రాథమిక ఆమోదం తెలిపింది. ఇలాంటి ఆయుధాలను ప్రస్తుతం కొన సాగుతున్న రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో విస్తృతంగా వినియోగిస్తున్నారు. రష్యా దళాలను, సాయుధ వాహనాలను లక్ష్యంగా చేసుకొనేందుకు ఉక్రెయిన్ సైన్యం ఈ డ్రోన్లను ఎక్కువగా వినియోగిస్తున్నది.

### కామికేజ్ అంటే అర్థం ఏంటి?

కామికేజ్ అనేది ఒక జపనీస్ పదం. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ఒక ప్రత్యేక అటాకింగ్ యూనిట్‌కు ఈ పేరు పెట్టారు. ఇందులోని మిలటరీ పైలట్లు తమ యుద్ధ విమానాలను శత్రు లక్ష్యాలపై కూల్చడం ద్వారా ఆత్మాహుతి మిషన్లు నిర్వహించేవారు.

### 'కామికేజ్' డ్రోన్ ప్రత్యేకతలు

- 2.8 మీటర్ల పొడవు, 3.5 మీటర్ల వెడల్పు
- 120 కేజీల బరువు, గంటకు 180 కి.మీ గరిష్ఠ వేగం
- 1,000 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యం
- 25 కేజీల పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలవు
- ఆత్మాహుతితో ఎంచుకొన్న లక్ష్యాలను నాశనం చేస్తాయి
- దూరంగా ఉండి కూడా మానవ కమాండ్లు ఇవ్వొచ్చు
- ఈ డ్రోన్లను గుంపుగా శత్రు లక్ష్యాలపైకి పంపొచ్చు
- రాడార్లు, శత్రు రక్షణ వ్యవస్థను అధిగమించే సామర్థ్యం

# డబుల్ రిజిస్ట్రేషన్లు వాస్తవమే

నమస్తే ఎఫెక్ట్

**రాచకొండ భూముల విచారణలో వెల్లడి**
**రంగారెడ్డి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చిన ఆర్డీవో**
**'నమస్తే తెలంగాణ' వార్తకు అధికారుల స్పందన**

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 13: రంగారెడ్డి జిల్లా మంచాల మండలం రాచకొండ పరిసర ప్రాంతాల్లో జరిగిన భూముల రిజిస్ట్రేషన్లలో అవకతవకలు జరిగినట్టు విచారణలో తేలిందని, ఈ విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేశామని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు. మంచాల మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున డబుల్ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్టు 'నమస్తే తెలంగాణ'లో ఈ నెల 5న వార్తా కథనాన్ని ప్రచురించింది. ఇందుకు కలెక్టర్ స్పందించారు. విచారణ జరిపి వెంటనే తనకు నివేదిక అందజేయాలని ఆర్డీవోను ఆదేశించారు. దీనిపై విచారణ చేపట్టిన ఆర్డీవో అనంతరెడ్డి రెండు రోజుల క్రితం కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. మండలంలో గతంలో అమ్మిన భూములకు అప్పటి రైతుల పేరిట పాస్‌బుక్‌లు వచ్చినందున వాటిని తిరిగి ఇతరులకు విక్రయిస్తున్నట్టు తెలిసిందని.. ఆ భూములపై రెండోసారి కూడా రిజిస్ట్రేషన్లు జరిగాయని ఆయన నివేదికలో పేర్కొన్నారు. ఈ నివేదిక ఆధారంగా కలెక్టర్ తదుపరి చర్యలు తీసుకుంటారని ఆర్డీవో వివరించారు.

## పాఠ్యాంశంగా మహిళలపై నేరాలు-శిక్షలు!

### మహిళల భద్రతపై ఉన్నతాధికారులతో సమీక్షలో మంత్రి సీతక్క

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): మహిళలను గౌరవించటం, నేరాలు చేస్తే పడే శిక్షలపై చిన్నప్పటి నుంచే అవగాహన కల్పించాలని, అందుకోసం పాఠ్యాంశాల్లో ఈ అంశాలను చేర్చాలని మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. దీనికోసం స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో మహిళల భద్రతపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళల భద్రత కోసం ఐదు రోజుల స్పెషల్ డ్రైవ్ చేపట్టబోతున్నట్టు తెలిపారు. మహిళా మంత్రులు, ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని వివరించారు. సమాజంలో మహిళల భద్రత కోసం స్వయంసహాయక సంఘాల సహాయాన్ని తీసుకుంటామని, ఆ సంఘ సభ్యులతో గ్రామ స్థాయి నుంచి సోషల్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. బాధిత మహిళలు బహిరంగంగా మాట్లాడేలా ధైర్యం కల్పిస్తామని తెలిపారు. వేధింపులకు పాల్పడాలంటేనే భయపడేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు.

## రుణమాఫీ తర్వాతే పంచాయతీలకు నిధులు : సీతక్క

రైతు రుణమాఫీ పూర్తయిన తరువాత గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేస్తామని పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనం, స్వయం సహాయక సంఘాల బలోపేతం తదితర అంశాలపై జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సచివాలయం నుంచి సీతక్క మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. స్వచ్ఛదనం-పచ్చదనం స్పెషల్‌డ్రైవ్‌లో అనుకున్న ఫలితాలు సాధించినప్పటికీ, శానిటేషన్ మెరుగుపడాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం కోసం మంచి పనితీరు కనబరిచిన సిబ్బందిని స్వాతంత్ర్య దినోత్సవం రోజు సన్మానించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రతినెలలో మూడు రోజులపాటు స్వచ్ఛదనం-పచ్చదనం డ్రైవ్ కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఆయా జిల్లాల్లో పారిశుద్ధ్య లోపాలపై వార్తలు వస్తున్న నేపథ్యంలో అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు.





